క్లుప్తంగా

నేడు బర్న్స్‌వార్డు ప్రారంభం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి క్రాస్ రోడ్డులోని అమోర్ ఆసుపత్రిలో మంగళవారం బర్న్స్ వార్డును కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బర్న్స్ వార్డులో ఆధునిక టెక్నాలజీతో కూడిన పరికరాలతో చికిత్స అందించనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం జరిగాయి. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 742 ఓట్లు ఉండగా 620 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 83.55 శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

అన్న సమారాధన



మూసాపేట: మూసాపేటలో మల్లన్నస్వామి కల్యాణ ఉత్సావాల్లో భాగంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భూకల శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. మల్లన్న ఒగ్గు కథ ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌కుమార్ యాదవ్, వైస్‌చైర్మన్ ఏళ్లేశ్ యాదవ్, స్థానిక ప్రజలు, కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం

గచ్చిబౌలి: మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని రాయదుర్గం ఎస్‌ఐ ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం రాయదుర్గం సర్వే నంబర్ 83, నాలెడ్జిసిటీలోని ఐటీసీ కోహినూర్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా 'మహిళల భద్రత–సైబర్ క్రైమ్'పై హోటల్‌లోని మహిళా సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పని చేస్తున్న చోట, నివాసం ఉండే చోట లేదా ప్రయాణించే మార్గాల్లో ఎలాంటి వేధింపులకు గురైనా ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితుల పేర్లను గోప్యంగా ఉంచుతారని వేధింపులకు పాల్పడిన వారి భరతం పడతామని ఆయన హెచ్చరించారు. షీ టీమ్ ట్విట్టర్, షీటీమ్ 9490617444, లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. నకిలీ యాప్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లతో మోసాలకు పాల్పడుతున్నారని అప్రమత్తంగా ఉండాలని మహిళలకు సూచించారు. సైబర్ క్రైం కేసులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, అవగాహనతోనే కేసులు తగ్గుముఖం పడతాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సతీష్, షీ టీం సభ్యులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

డిజిటల్ ఆవిష్కరణల రూపకల్పనకు..

నాలెడ్జి సిటీలో అలైన్ ఇన్నోవేషన్ సెంటర్

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జిసిటీలోని సలార్‌పురియా సత్వా నాలెడ్జ్ పార్కులో అలైన్ ఇన్నోవేషన్ సెంటర్‌ను సోమవారం ప్రారంభించారు. అలైన్ టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ డిజిటల్ ఆఫీసర్ శ్రీలక్ష్మీ కొల్లి, సీనియర్ డైరెక్టర్, సెంటర్ జీఎం శ్రీనితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇండస్ట్రీకి చెందిన ప్రతిభావంతులను ఒకచోటకు చేర్చి డిజిటల్ ఆవిష్కరణలను నడిపించడంలో ఈ ఇన్నోవేషన్ సెంటర్ సహాయపడుతుందన్నారు. అలైన్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్ డిజిటల్ డెంటిస్ట్రీ, ఆర్థోడాంటిక్స్‌ను అభివృద్ధి చేసి ఆవిష్కరణలను రూపొందించడానికి మా భాగస్వాములు కస్టమర్లతో కలిసి పనిచేయడానికి ఎదురు చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఔషధ ఆవిష్కరణలో 'ఏఐఅండ్‌ఎంఎల్' కీలకపాత్ర



డాక్టర్ రాధారంగరాజన్

రాయదుర్గం: ఔషధ ఆవిష్కరణలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (ఏఐ అండ్‌ఎంఎల్) పాత్ర కీలకమని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్–సెంట్రల్ డ్రగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(సీఎస్ఐఆర్–సీడీఆర్ఐ) డైరెక్టర్ డాక్టర్ రాధారంగరాజన్ అన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 'డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్– 2023 ఏ వర్చువల్ వర్క్‌షాప్'ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ నూతన ఔషధాల ఆవిష్కరణ, అపరిష్కృత వైద్య అవసరాలను గుర్తించడం, క్లినికల్ ట్రయల్స్‌ను వేగవంతం చేయడంలో ఏఐ అండ్ ఎంఎల్ ఉపయోగపడతాయన్నారు. గురుస్ బోర్డు చైర్మన్ కో ఫౌండర్, సీఈఓ డాక్టర్ జగత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ యువ పరిశోధకులు, ఔషధ ఆవిష్కరణలో వారి నైపుణ్యాలు, జ్ఞానాన్ని మెరుగుపర్చడానికి ఒక వేదికను అందిస్తుందన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్ (ఎఫ్ఏబీఏ) ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పి రెడ్డన్న, డాక్టర్ అజిత్, కామత్, హెచ్‌సీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ బిందు మాధవరెడ్డి తదితరులు ప్రసంగించారు.

అక్రమ పార్కింగ్

- రాకపోకలకు ఇబ్బందులు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కేపీహెచ్‌బీ కాలనీవాసులు





కేపీహెచ్‌బీ కాలనీలోని అంతర్గత రహదారుల్లో అక్రమ పార్కింగ్

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డుకాలనీలో వాహనాల అక్రమ పార్కింగ్‌తో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా రోజంతా వాహనాలు రోడ్లపై పార్కింగ్ చేస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్లపై రాకపోకలు సాగించేందుకు కూడా అవస్థలు పడుతున్నారు. కాలనీలోని ప్రధాన రోడ్లు మొదలుకొని అంతర్గత రోడ్ల వరకు ఇదే పరిస్థితి నెలకొందంటే అతిశయోక్తి కాదు.

◆ ఒకప్పుడు కాలనీలో నివాసాలు అధికంగా ఉండేవి. నేడు ప్రతి వీధిలోకి వ్యాపారాలు, వాణిజ్య కేంద్రాలు వచ్చి చేరాయి. దీంతో రోజు ఇక్కడికి వచ్చి వెళ్లే వారి సంఖ్య కూడా పెరిగింది. నిత్యం కేపీహెచ్‌బీకాలనీ రద్దీగా మారింది.

◆ అనుమతులు లేకుండా అక్రమంగా వెలసిన బహుళ అంతస్తుల భవనాలు అధిక అద్దెలు లక్ష్యంగా కనీసం పార్కింగ్ కోసం స్థలం కూడా కేటాయించలేదు. దీంతో రోడ్లే పార్కింగ్ కేంద్రాలుగా మారాయి.

◆ కాలనీలోని ప్రధాన దారుల్లోని భవనాలు, ఆసుపత్రులకు, వస్త్ర వ్యాపార కేంద్రాలకు నిలయంగా మారాయి. దీంతో పగలంతా ఈ దారుల్లో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు రోడ్లపై అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు.

◆ అంతర్గత రోడ్లకు ఇరువైపులా ఉన్న ఎల్‌ఐజీ, ఎంఐజీ, ఈడబ్ల్యూఎస్ భవనాలు హాస్టల్స్‌కు అద్దెకు ఇచ్చారు. దీంతో హాస్టల్స్‌లో వసతి పొందుతున్న వారి వాహనాలు రాత్రి వేళల్లో రోడ్లపై వరుసగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రాత్రి కూడా రోడ్లన్నీ అక్రమ పార్కింగ్ వాహనాలతో నిండిపోతున్నాయి.

◆ కేపీహెచ్‌బీకాలనీలోని 7వ ఫేజులో 60 అడుగుల రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలతో రోడ్డు కుంచించుకు పోగా ఆ కాస్త మిగిలిన రోడ్డు పైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

◆ అపత్కాలంలో అంబులెన్స్ వచ్చే అవకాశం కూడా లేకుండా పోతోందని చెబుతున్నారు.

◆ జీహెచ్‌ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే హడావిడి చేసి వెళ్లిపోతున్నారు. పకడ్బందీగా అక్రమ పార్కింగ్‌కు దీర్ఘకాలిక పరిష్కారం చూపలేకపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి..

కేపీహెచ్‌బీ కాలనీలో రోడ్లపై వాహనాల అక్రమ పార్కింగ్ విషయంలో జీహెచ్‌ఎంసీ అధికారుల, ట్రాఫిక్ పోలీసులు సత్వరం స్పందించాలి. విశాలమైన రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేసే వారిపై, అక్రమంగా వాహనాలు పార్కింగ్ చేసే వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలి. కనీసం పార్కింగ్ సదుపాయం లేని భవనాలను గుర్తించి రెట్టింపు ఆస్తిపన్ను విధించాలి. ఇప్పటికైనా అక్రమ పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయాలి.

– అంజిబాబు, కేపీహెచ్‌బీకాలనీ 7వ ఫేజ్

శ్రీరామనవమి నిర్వహణపై ఎమ్మెల్యే సమీక్ష



సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రామాలయంలో శ్రీరామనవమి, ఆలయ వార్షికోత్సవ నిర్వహణపై సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా శ్రీరామనవమి వేడుకలకు భక్తులు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. తాగు నీరు, మెడికల్ సౌకర్యం, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అదే విధంగా ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా పూజల నిర్వహణపై మాట్లాడారు. కార్యక్రమాంలో బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బాబురావు, మాధవరం రంగారావు, దేవదాయ శాఖ అధికారి ఆంజనేయులు, కమిటీ సభ్యులు తులసీరావ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం

కూకట్‌పల్లి: మూసాపేట యాదవబస్తీలోని శ్రీ భ్రమరాంబికా మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు కూకట్‌పల్లి మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు, పీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని అన్నారు. కార్యక్రమంలో తూము వేణు, కుమార్‌యాదవ్, ఎల్లేష్‌యాదవ్, మల్లేష్‌యాదవ్, నర్సింహయాదవ్, రాజకుమార్‌యాదవ్, బత్కేర్ లింగం, పరమేష్, మల్లేష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలి



లాంగ్ టెన్నిస్ కోర్టు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శిరీష

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేజు, జంగిల్ బుక్ థీమ్ పార్కు వెనుక నూతనంగా నిర్మిస్తున్న లాంగ్ టెన్నిస్ కోర్టు పనులను సోమవారం కార్పొరేటర్ పగుడాల శిరీష పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పిల్లలు క్రీడల పట్ల అత్యంత ఉత్సాహం చూపే విధంగా అవకాశాలు కల్పిస్తూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అదే విధంగా పిల్లలు క్రీడల పట్ల ఆకర్షితులయ్యే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సాహించాలని సూచించారు. క్రీడలతో మంచి శారీరక వ్యాయామం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అజయ్, భాస్కర్‌రావు, నర్సింగ్‌రావు, శారద తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యం



కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించిన కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కంటి వెలుగును నిర్వహిస్తున్నారని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. సోమవారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీహిల్స్ కాలనీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మానవ అవయవాల్లో అతి ప్రధాన అవయవం నేత్రమని అన్నారు. ఎవరికైనా కంటి సమస్యలు ఉంటే ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు, ఆపరేషన్లు కూడా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సిబ్బంది మాధవ్, రమణరెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మనూలో 'సూడాన్' బృందం

రాయదుర్గం: సూడాన్ దేశంలోని వైట్‌నైల్ యూనివర్సిటీ ప్రతినిధి బృందం సోమవారం గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది.వీసీ సయ్యద్ ఐనుల్ హసన్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. వైట్‌నైల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎల్హాజలి ఈ సాహమద్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం రెండు విశ్వవిద్యాలయాల మధ్య సహకారం, సంభావ్యతపై చర్చించారు.

మహిళల రక్షణపై సింపోజియం

రాయదుర్గం: డిజిటల్ స్పేస్‌లో మహిళల రక్షణపై మనూలో నేడు ప్రత్యేక సింపోజియంను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు డీడబ్ల్యూ హెడ్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ అమీనా తహసీన్ తెలిపారు. 'లింగ సమానత్వం, డిజిటల్‌లో మహిళల రక్షణ' అనే అంశంపై మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు క్యాంపస్‌లోని సయ్యద్ హమీద్ లైబ్రరీ ఆడిటోరియంలో సింపోజియం నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడండి



డీసీ రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ సర్వే నం.92, 93, జింకలవాడ, ప్రభాకర్‌రెడ్డినగర్ వెనకాల నాలా పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని సోమవారం మూసాపేట డీసీ రవికుమార్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 2009లో జయప్రకాష్ నారాయణ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ స్థలంలో ప్రభుత్వం ఫెన్సింగ్ వేసిందన్నారు. అయినా కబ్జాదారులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. గతంలో జీహెచ్‌ఎంసీ, తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల్లో ఫిర్యాదులు చేస్తే అక్రమ కట్టడాలను కూల్చివేశారని పేర్కొన్నారు. తిరిగి గత వారం రోజుల నుంచి కొందరు అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్, అన్వర్, రఘు నియామత్, శివ, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

మనూలో యునానీ హెల్త్ క్యాంప్

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ సూచించారు. యూనివర్సిటీ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ, నేషనల్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యునానీ మెడిసిన్ ఫర్ స్కిన్ డిజార్డర్స్ (ఎన్ఆర్ఐయూఎంఎస్‌డీ)హైదరాబాద్‌తో కలిసి సోమవారం యునానీ హెల్త్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ వ్యాయామం, వాకింగ్, సైక్లింగ్ చేయాలని సూచించారు. ఆరోగ్యంగా ఉంటేనే చదువు, ఉద్యోగం, ఇతర విధులను సక్రమంగా చేయడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. సాంప్రదాయ, ప్రత్యామ్నాయ వైద్యం యొక్క ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయన్నారు. కాగా క్యాంపస్‌లో యునానీ పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేస్తామని ఎన్ఆర్ఐయూఎంఎస్‌డీ ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ అహ్మద్ మిన్హాజుద్దీన్ వెల్లడించారు.

త్వరలో సీసీ రోడ్డు నిర్మాణం చేపడతాం



సీసీ రోడ్డు నిర్మించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: సాయినగర్ వెస్ట్‌లో ఎర్రపోచమ్మ దేవాలయం వద్ద రోడ్‌నం.4లో సీసీరోడ్డు పనులు జరిగే ప్రాంతాన్ని సోమవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ వీధిలో ఇటీవలే డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని తెలిపారు. సీసీ రోడ్డు పనులను త్వరలో ప్రాంభించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు రాజేష్‌చంద్ర, నాయకులు చిన్నోళ్ల శ్రీనివాస్, శ్రీధర్, సంతోష్ బిరాదర్, సుబ్బారావు, మహేష్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

బాలానగర్: సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని శివశంకర్‌కాలనీలో డ్రైనేజీ సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. జలమండలి డీజీఎం సంశీర్, మేనేజర్ అనిల్‌తో కలిసి కాలనీలో పర్యటించారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నాయకులు సాయినాథ్, శివరామ్, కరీం, బస్తీవాసులు పాల్గొన్నారు.



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్

రోడ్డు ప్రమాదంలో జొమాటో డెలివరీ బాయ్ దుర్మరణం

గచ్చిబౌలి: లారీని ఓవర్ టేక్ చేయబోయి లారీ వెనుక చక్రాల కిందపడి జొమాటో డెలివరీ బాయ్ మృతి చెందాడు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ శోభన్‌బాబు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జూబ్లీహిల్స్ నందీనగర్‌లో నివాసం ఉండే శ్యామ్(33) జొమాటో ఫుడ్ డెలివరీ బాయ్.

◆ హోండా బైక్‌పై నానక్‌రాంగూడ నుంచి ఓఆర్ఆర్ రోటరీ వైపు వస్తుండగా నానక్‌రాంగూడ రోటరీ వద్ద సోమవారం మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో లారీని ఓవర్ టేక్ చేయబోయి ఢీ కొట్టాడు. వెనక చక్రాల కింద పడటంతో శ్యామ్‌కు నడుము భాగంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లావణ్య, కొడుకు కార్తీక్(9), కూతురు యజ్ఞిత(8) ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న మాధవరం కాంతారావు

మూసాపేట: మూసాపేట డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సోమవారం కూకట్‌పల్లి బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతిరోజు కనీసం గంట వ్యాయామం, సమయానికి భోజనం చేయటం, తగిన విశ్రాంతి తీసుకోవడం, ఒత్తిడి తగ్గించుకొని తరచు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అడ్వైజరి కమిటీ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, మూసాపేట కార్పొరేటర్ మహేందర్, కర్కదాగయ్య, మల్లేష్, వినోద్‌కుమార్, సాయిప్రసాద్, శేఖర్‌గుప్తా, శైలేష్ కుమార్, మంగమ్మ, జానకి, రాజేశ్వరి, కృష్ణయాదవ్, మాణిక్, మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

మిల్లెట్స్ అల్పాహారం అందజేత

రాయదుర్గం: ఖాజాగూడలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో మిల్లెట్స్ అల్పాహారాన్ని స్థానికులకు అందించారు కామధేను ఆర్గానిక్, నయా మిల్లెట్స్, బీజేపీ నాయకులు అంజన్‌కుమార్‌లు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మూల అనిల్‌గౌడ్, నక్క శివకుమార్ మాట్లాడుతూ జంక్‌ఫుడ్ తినడం వల్ల అనారోగ్యాలకు గురవుతున్నారని మిల్లెట్స్‌తో తయారు చేసిన ఆహారపదార్థాలను తినడంపై అందరూ దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుతం సంవత్సరం మిల్లెట్స్ సంవత్సరం కావడంతో 365 రోజులపాటు మిల్లెట్స్‌తో తయారు చేసిన అల్పాహారాన్ని ప్రతినిత్యం ఒక ప్రాంతంలో అందించాలని నిర్ణయించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణయాదవ్, ప్రవీణ్ కుమార్, వెంకటేష్, సదానందం, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అనుకుంటే సాధించలేనిది ఏది లేదు



ఆటల పోటీల్లో పాల్గొన్న మహిళలు


ఓల్డ్ బోయిన్‌పల్లి: మహిళలు మహారాణులుగా ఎదిగేందుకు కృషి చేయాలని... వారు అనుకుంటే సాధించలేనిది ఏది లేదని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ వైస్‌ప్రెసిడెంట్ సి.వనజ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా సమతానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. మ్యూజికల్ చైర్, ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్ ఇలా పది ఆటలతో మహిళలు అందరిని ఔర అనిపించారు. ఈ సందర్భంగా పోటీలలో విజేతలుగా నిలిచిన మహిళలకు వనజ బహుమతులను అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నప్పటికీ మరింత ముందుకెళ్లాల్సిన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మహిళా కన్వీనర్ సదాలక్ష్మి, స్రవంతి, మీనాక్షి, ప్రమీల, సుధారాణి, సమతానగర్ అసోసియేషన్ అధ్యక్షుడు లోహిదాస్, కార్యదర్శి, నాగేశ్వర్ రావు, ఉపాధ్యక్షుడు రాంచందర్‌రావు, మధుసూదన్ రెడ్డి, నితిన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

హోలీ మిలన్



కూకట్‌పల్లి: భారత్ సంఘ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హోలీ మిలన్ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు హాజరై మాట్లాడారు. బిహార్‌కు చెందిన వారు నగరంలో వ్యాపారాలు చేసుకుంటూ నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. హోలీ సంవత్సరంలో సౌభాగ్యవంతమైన రోజులు ప్రజలు భావిస్తారని అన్నారు. అందరూ కలిసి జరుపుకునే ఈ వేడుకను హోలీ మిలన్‌గా నిర్వహించుకుంటారని పేర్కొన్నారు. బిహార్‌కు వెళ్లాలంటే హైదరాబాద్ నుంచి ఒకటే రైలు ఉందని.. పండగలకు ఊళ్లకు వెళ్లే సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని బిహారీలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన కాంతారావు కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకర్‌రావు, రామ్మోహన్, రాంనరేష్ యాదవ్, జైన లాల్‌జీ, విజయ్‌కుమార్, ధర్నా చటర్జీ, ధర్మవతి దేవి, దుర్గ దేవి, మమతా దేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మహిళా నాయకులు

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ జాగృతి ఫౌండర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టినరోజు వేడుకలను సోమవారం ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ మహిళా నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, చిన్నోళ్ల శ్రీనివాస్, శివరాజుగౌడ్, పాండుగౌడ్, రాజ్యలక్ష్మి, మధులత, లావణ్య, దేవి, వరలక్ష్మి, స్వప్న, రేణుక, మన్నే లక్ష్మి, సంతోషమ్మ, దుర్గ లక్ష్మి, మీనా, యాస్మిన్, మోహముదా తదితరులు పాల్గొన్నారు.